క్లుప్తంగా

వైభవంగా రుద్రాభిషేకం



పూజలో పాల్గొన్న భక్తులు

చివ్వెంల : పుష్య మాస శివరాత్రి సందర్భంగా ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామికి మంగళవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంత్రమూర్తి మనోహర శర్మ వేదమంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిల క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణ మోహన్, మధుసూదన చారి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాల బహూకరణ



స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలను అందజేస్తున్న పెండెం కృష్ణకుమార్

సూర్యాపేటటౌన్ : గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, సమాజ సేవకుడు, పర్యావరణవేత్త డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి జాతీయ నాయకుల, స్వాతంత్య్ర సమరయోధుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, గోడ గడియారం బహూకరించారు. ఈ సందర్భంగా డీఈఓ అశోక్ మాట్లాడారు. పెండెం కృష్ణ కుమార్ తన సొంత నిధులతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా బుధవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నాగులపాటి అన్నారం, నారాయణగూడెం, దోసపహాడ్, లింగాల ఫీడర్ కింద ఉన్న రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హరితహారం చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లిలో తెలంగాణకు హరితహారం నందు నాటిన మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. అయితే ఈ చెట్లను మంగళవారం ఎలాంటి అనుమతి లేకుండా నరికిన గ్రామవాసి బోసు యల్లయ్యకు డీపీఓ ఆదేశాల మేరకు రూ.3వేలు జరిమానా విధించారు. యల్లయ్య నుంచి రూ.3వేల జరిమానాను మండల పంచాయతీ అధికారి టి. గోపి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి వసూలు చేసి రశీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నూతనకల్ : గీత పనివారల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లతోపాటు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బూడిద మల్లయ్య, మాజీ ఎంపీటీసీ బండపల్లి సాగర్, మద్దెల రామ్మూర్తి, మొగుళ్ల వెంకన్న, గాజుల వెంకటయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



మహేశ్వరిని సన్మానిస్తున్న నాయకులు

నాగారం : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగారం గ్రామానికి చెందిన అనంతుల మహేశ్వరికి ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మంగళవారం నాగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడారు. విధులపట్ల అంకిత భావంతో పనిచేసి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా ఉత్తమ అవార్డు రావడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఎస్‌ఓ చింతమళ్ల రమేష్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు కడారి సోమయ్య, చిప్పలపల్లి మల్సూర్, కన్నెబోయిన అంజయ్య, చిప్పలపల్లి ఉపేందర్, సల్మాన్, చంద్రశేఖర్, గిరి, కన్నెబోయిన రాజు, చిప్పలపల్లి శివ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరీక్షణ ఫలించేనా..!

- రేషన్‌కార్డుల కోసం అర్హుల ఎదురుచూపు
- దరఖాస్తులు సమర్పించిన వందలాది కుటుంబాలు



ఆత్మకూర్ (ఎస్): దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆహార భద్రత కోసం అందించే రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఆత్మకూరు మండలంలో దాదాపు 11 ఏళ్లుగా కొత్త వాటితోపాటు మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. దీంతో వందలాదిమంది నిరుపేదలు రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ సరుకులే కాకుండా ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని అమలు చేసినా రేషన్‌కార్డులను ప్రమాణికంగా తీసుకుంటుండడంతో చాలామంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా కొత్తరేషన్ కార్డులను ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించినా.. ఇంత వరకు ప్రత్యేకంగా దరఖాస్తులను ఆహ్వానించలేదు. అయితే 10 ఏళ్ల పాటు అందిన దరఖాస్తులు, ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులే వందలాదిగా పెండింగ్‌లో ఉన్నాయి.

వందలాది మంది ఎదురు చూపు..!

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించింది. ఈ గ్రామ సభల్లో గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాలు ప్రకటిస్తామని చెప్పి దరఖాస్తుల పేర్లన్నీ చదివి వినిపించారు. అలాగే కొత్తగా దరఖాస్తులు స్వీకరించడంతో మండల వ్యాప్తంగా దాదాపు 1186 దరఖాస్తులు వచ్చాయి. పాత దరఖాస్తులతో పాటే గ్రామసభల్లో వచ్చిన వాటిని పరిశీలించి ఈ నెల 26వ తేదీ నుంచి అర్హులకు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పినా ఎక్కడా అమలు కాలేదు. కేవలం మండలంలో ఎంపిక చేసిన ఒక్క గ్రామంలోనే ఈ రేషన్ కార్డులను అందించగా.. ఇతర గ్రామాల్లో అర్హులైన రేషన్ లబ్ధిదారులు తమకు ఇంతకు కార్డులు ఇస్తారా..? ఇవ్వరా .. అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచే కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించి సన్నబియ్యం సైతం ఇస్తామని చెప్పడంతో ప్రజలంతా ఎంతో ఆశగా ఎదురుచూశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ఎప్పుడు రేషన్ కార్డులను అందిస్తారోనని జనం ఎదురు చూస్తున్నారు.

తీవ్ర ఇబ్బంది పడ్డాం



చాలాకాలంగా రేషన్ కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో మూడు సార్లు దరఖాస్తు చేశాను. ఆర్డీఓ స్థాయి అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం లిస్టులో పేరు ఉన్నప్పటికీ ఇస్తారో లేదోనన్న ఆందోళన నెలకొంది. అర్హులైన వారందరికీ వెంటనే కార్డులు ఇస్తే బాగుంటుంది.

- గునగంటి మల్లయ్య, ఆత్మకూర్ (ఎస్)

రేషన్ కార్డులు అందించాలి



అర్హులైన వారందరికీ వెంటనే రేషన్ కార్డులు అందించాలి. 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు లేకపోవడంతో వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అర్హులం కాలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కార్డులు అందించాలి. మాకు వివిధ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి.

- నవిలె రవి, ఏపూరు

కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రేణుక

భానుపురి : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సివిల్ ఫార్మా కంపెనీపై సిట్టింగ్ జడ్జితో ఎంక్వయిరీ చేయించి సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. మంగళవారం లెనిన్ నగర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దొడ్డిదారులలో అనుమతి పొంది, తప్పుడు విధానాలతో 30 ఏళ్లుగా కంపెనీలను నడిపిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. గతంలో అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, చంద్రకళ, సంతోషిమాత, జయమ్మ, వీరబాబు, జానయ్య, సురేష్, పద్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, సైకిళ్ల పంపిణీ



కుట్టు మిషన్లు, సైకిళ్లు పంపిణీ చేస్తున్న దాతలు

సూర్యాపేటటౌన్ : నిరుపేదల కుటుంబాలకు చేయూత అందించేందుకు వారికి కుట్టు మిషన్లు, సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు కమ్యూనిటీ డవలప్మెంట్ సెంటర్(సీడీసీ)అధ్యక్షుడు వంగాల రత్న ప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కమ్యూనిటీ డవలప్మెంట్ సెంటర్ కార్యాలయంలో హోప్ కేర్ సెంటర్ అండ్ కిట్ ద కింగ్ డం, వీవైఆర్ (వంగాల యేసు రత్నం ఫౌండేషన్) సహకారంతో 50మంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అలాగే 50మంది నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి సమాజాభివృద్ధికి చిహ్నమని తెలిపారు. మహిళలు ఉపాధి పొందికుటుంబానికి అండగా ఉండేలా ప్రతి సంవత్సరం కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బొజ్జ ప్రశాంత్, వంగాల లాజరస్, సంద్రపాటి లాజరస్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్.2లో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉదయశ్రీ మాట్లాడారు. విద్యార్థులు చక్కగా తమకు కేటాయించిన పాత్రలను పోషించారన్నారు. భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని, వారిని అభినందిస్తూ పదో తరగతి పరీక్షలో మంచి ఫలితాలు అందించాలని కోరారు. ముఖ్యమంత్రిగా హరిచారి, విద్యాశాఖ మంత్రిగా పి.తేజ , జాయింట్ డైరెక్టర్ గా భవ శ్రీ, ప్రధానోపాధ్యాయులుగా అక్షయ, కలెక్టర్‌గా రిషికేశవ, ఆర్‌జేడీగా సంకీర్తనతో పాటు పలువురు వివిధ పాత్రలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంకతి వెంకన్న, మురళీకృష్ణ, కరుణాకర్, శ్రీనివాసరావు, రమేష్, రషీద్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, ఎస్ఎన్ రెడ్డి, సుజాత, లలిత, దివ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుంగతుర్తి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసిన మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడంతో కేంద్ర ప్రభుత్వానికి యావత్తు మాదిగ జాతి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను, అనుదీప్, మల్లేపాక సాయిబాబా, వెంకన్న, రవీందర్, రవికుమార్, సాయికిరణ్, వెంకటేష్, జలంధర్, మధుసూదన్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



సూర్యాపేట టౌన్ : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

సూర్యాపేటటౌన్ : వాహనదారులు తప్పనిసరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఖమ్మం రోడ్డులో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

అర్వపల్లి : రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అర్వపల్లిలోని వైజంక్షన్‌లో మంగళవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామకోటి, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

నూతనకల్ : సైబర్ నేరాల పట్ల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసినట్లయితే వ్యక్తిగత సమాచారం అందించవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఎం. వెంకన్న, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు మహాధర్నాకు తరలిన నాయకులు



సూర్యాపేట : మహాధర్నాకు వెళ్తున్న నాయకులు

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. నల్లగొండలో జరిగే రైతు మహాధర్నాకు తరలివెళ్లే వాహనాలను మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు లతీఫ్, సందీప్, కళ్యాణ్, నెమ్మాది నగేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామానికి పరిమితం చేయడం తగదు

అర్వపల్లి : ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని మండలంలో ఒకే గ్రామానికి పరిమితం చేయడం తగదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దావుల వీరప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం అర్వపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నల్లగొండలో జరిగే మహాధర్నాకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టిపాక సైదులు, బొడ్డు రామలింగయ్య, వెంకన్న, శేఖర్‌రెడ్డి, రామకోటి, నరేష్, ఎల్లంరాజు, విజయ్, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి : నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రైతు మహాధర్నాకు తుంగతుర్తి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, గోపాల్ రెడ్డి, దొంగరి శ్రీను, బర్ల సోమన్న ఉన్నారు.

మద్దిరాల : నల్లగొండలో తలపెట్టిన రైతు మహాధర్నాకు మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజాక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తరలిన వారిలో మాజీ వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్డాణం మధుసూదన్, పాతూరి లింగారెడ్డి, సూరారపు రాజు పాల్గొన్నారు.

నూతనకల్ : నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు మహాధర్నాకు మండలంలోని గ్రామాల నుంచి మంగళవారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, గాజుల తిర్మల్‌రావు, బత్తుల విద్యాసాగర్, లింగరాజు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

నడిగూడెం : నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రాపురంలో మంగళవారం యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లుబెల్లి మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జంగిలి వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా పప్పుల రాజకుమార్, 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ముదిరెడ్డి నళిణి, వెంకటరెడ్డి, అల్లుబెల్లి గుర్వారెడ్డి, నాగిరెడ్డి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మద్దిరాల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంగళవారం మద్దిరాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని గోరెంట్లలో మహిళా సంఘాలకు చెందిన రూ.28లక్షలను వెంటనే రికవరీ చేయాలని, లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో గతంలో మంజూరైన సీసీరోడ్ల పనులను మార్చి 15లోగా పూర్తి చేయాలన్నారు. చౌళ్లతండాకు అంగన్‌వాడీ బిల్డింగ్, పోలుమల్ల, చిన్ననెమిల గ్రామాలకు హెల్త్ సబ్ సెంటర్లు మంజూరైనందున తహసీల్దార్ స్థల పరిశీలన చేసి నివేదికను అందజేయాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డులను అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని తెలిపారు. విద్యాశాఖ అధికారులు 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఎప్పటికప్పుడు ప్రజలకు అందేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారికి సూచించారు. పీహెచ్‌సీ బిల్డింగ్ కోసం స్థల పరిశీలన చేయాలని అన్నారు. మందుల వివరాలను రిజిస్టర్‌లలో నమోదు చేస్తున్నారా అని డాక్టర్‌ను అడగగా.. స్టాక్ ఎంట్రీ చేయడం లేదని తెలపడంతో ఫార్మసిస్ట్ యాదగిరిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా మద్దిరాల, రామచంద్రపురం గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ రమేష్, మండల ప్రత్యేక అధికారి నాగయ్య, తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషా రూహి, ఎంఈఓ తండు వెంకటనారాయణ, ఐబీ డీఈఈ హరికృష్ణ, ఎంపీఓ ఇబ్రహీం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వినతి

గ్రామాల్లో చెరువు కట్టల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వంగూరి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డాణం కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇరిగేషన్ ఉన్నత అధికారులను పంపించి పనులను పరిశీలిస్తామని, పనుల్లో లోపాలు ఉన్నట్లు తెలిస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంపెల్లి గంగధర్, పెదూరి తులసీదాస్, జనాస్, హనుమంతు, ఉపేందర్ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



భానుపురి : కొత్త బస్టాండ్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భానుపురి : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, గద్దర్ పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ అన్నారు. మంగళవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపుతో కొత్త బస్టాండ్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడు జావిద్ బేగ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు సాయి, నాయకులు నాగుల వాసు, రుద్రంగి రవి, శబరి, పందిరి మల్లేష్, సాజిద్, శివ, నాని, సమీర్, నరేష్, అనిల్, సుధీర్, నాగరాజు, మణికంఠ, రాపర్తి శ్రీనివాస్, సమీర్, వీరయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజా గాయకుడు గద్దర్ పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సంజయ్ చేసిన వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరికొప్పుల నరేష్, కొండ రాజు, రామడుగు నవీన్ చారి, పెద్దబోయిన అజయ్, గుండగాని మహేందర్, మాచర్ల అనిల్, వలీ, నవీన్, అక్బర్‌బాషా, శ్రీకాంత్, వేణు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ చురుకంటి చంద్రారెడ్డి, బండపల్లి సాగర్, గాజుల వెంకటయ్య, బాణాల మల్లారెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, లావుడ్యా శ్రీధర్‌నాయక్, వెంపల్ల కోటిరెడ్డి, కాస శంకర్, బొల్క సైదులు, మూడ్ మోహన్ నాయక్, సానబోయిన శంకర్, బండపల్లి మహేష్, బుల్లేష్, సంపత్, సమ్మెట్ వెంకట్ పాల్గొన్నారు.

వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

నాగారం : ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె.వలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయి, గద్దర్ చేసిన ప్రజా పోరాటాలు తెలియక మాట్లాడుతున్నారని అన్నారు. పల్లె, పట్టణ ప్రజలను చైతన్యం చేస్తూ చివరి వరకు ప్రజల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన ఒక విప్లవాగ్ని గద్దర్ అని అన్నారు. బండి సంజయ్ వెంటనే గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆయనతోపాటు యూత్ కాంగ్రెస్ నాయకులు అక్బర్‌పాషా, హుస్సేన్, సైదులు తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయిన విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ విమర్శించారు. మంగళవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గద్దర్ తన ఆటపాట ద్వారా చేసిన ప్రజా పోరాటాలు మంత్రికి తెలియలేదా అని ప్రశ్నించారు. సంజయ్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



నూతనకల్‌లో..



తుంగతుర్తిలో..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన పలువురికి వైద్య ఖర్చుల కోసం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి సహకారంతో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ బాధితులకు పంపిణీ చేశారు. నర్సింగ ధనమ్మకు రూ. 50వేలు, ఉప్పు అవిలేనుకు రూ. 60వేలు, మాదగాని మహేష్‌కు రూ. 20వేలు, వల్లాల శైలజకు రూ. 17వేల చొప్పున మొత్తం రూ. 1.47లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు ఎం. సత్యనారాయణ, ఎల్లెంల కొమిరెల్లి, జె. సోమయ్య, బింగి కృష్ణమూర్తి, కుంభం సత్తయ్య, బాబురావు, లింగయ్య, వెంకన్న, సైదులు, సుదర్శన్, నరహరి, రాంప్రసాద్, డాక్టర్ విజయ్, సందీప్, అనిల్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు కిష్టయ్యకు నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, రిటైర్డ్ హెచ్ఎం, వినియోగదారుల సంఘం రాష్ట్ర నాయకుడు సుతారపు కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో మంగళవారం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, గవర్నర్ దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు. అలాగే వివిధ పార్టీల నాయకులు, స్నేహితులు, బంధువులు మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుతారపు రవీందర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పని దినాల విధానం ఎత్తివేయాలి

పెన్‌పహాడ్: ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి 20 రోజుల ఉపాధి హామీ పని దినాల విధానం ఎత్తివేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చెట్లముకుందాపురం గ్రామంలో సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో భూమిలేని కుటుంబాలు చాలా ఉన్నాయని, వారందరికీ ఆత్మీయ భరోసా పథకం కల్పించాలన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. శ్రీరాంసాగర్ కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలని అన్నారు. చీదెళ్ల-చెట్లముకుందాపురం రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మడ్డి అంజిబాబుగౌడ్, సీపీఎం మాజీ సర్పంచ్ గుర్రం గోపాల్‌రెడ్డి, సీపీఎం మాజీ ఎంపీటీసీ అంజనపెల్లి పిచ్చమ్మ, జానయ్య, అనంతుల గుర్వయ్య, కట్టెల జార్జి, సూరపల్లి చంద్రయ్య, వెంకటయ్య, రాంపంగి వెంకటయ్య, మంగమ్మ, పిచ్చయ్య, జానకిరాములు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నియోజవకర్గ ప్రధాన కార్యదర్శి ఎలినేటి సాయి మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దామెర్ల సోమయ్య, వెంకటరాములు, రాము, మైసయ్య, వెంకన్న, జటంగి గణేష్, మణికంఠ, శ్రీకాంత్, మహేష్, అభినయ్, ప్రణయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాయిలెట్లు ధ్వంసం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏడాది కిందట మన ఊరు - మన బడి పథకంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా కొత్తగా టైయిలెట్లు నిర్మించారు. అయితే సోమవారం రాత్రి ఆకతాయిలు మరుగుదొడ్లను ధ్వంసం చేసి అందులోని టైల్స్, ఇతర సామగ్రిని ఎక్కడికక్కడ పగలగొట్టారు. ఇప్పటికే తరచూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆకతాయిలు మద్యం సేవించి సీసాలను పగలగొట్టి వేస్తున్నారు. ఈ విషయమై గతంలో గ్రామస్తులు అనేక మార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని పాఠశాల చైర్‌పర్సన్ కాగితాల కరుణశ్రీ, హెచ్ఎం జి. ఇందిర అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.